వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శనివారం 10 అక్టోబర్ 2026

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 103



PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



నేటి నుంచి పూల పండగ

9 రోజులపాటు బతుకమ్మ వేడుకలు

18న రాజధానిలో సద్దుల బతుకమ్మ

రాష్ట్ర సంస్కృతికి ప్రతీక, మహిళలకు అత్యంత ప్రీతిపాత్రమైన బతుకమ్మ పండుగ శనివారం ప్రారంభం కానుంది. రాజధాని హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో వాడవాడలా వేడుకలను ఈ నెల 18 వరకు తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నారు. సచివాలయం, లోక్‌భవన్, శాసనసభ, మండలి సహా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లోనూ సందడి నెలకొననుంది.

హైదరాబాద్, అక్టోబర్ 09 : ఇంటింటా మహిళలు సహజసిద్ధమైన తీరొక్క పూలతో ఇంటింటా బతుకమ్మను పేర్చి... పసుపు, కుంకుమలతో గౌరమ్మను చేసి భక్తిశ్రద్ధలతో కొలుస్తారు. గ్రామాల కూడళ్లు, ఆలయాల ప్రాంగణాలు, వేదికల వద్దకు ఊరేగింపుగా వెళ్లి... బతుకమ్మ ఆటపాటలతో అలరిస్తారు. రాత్రిపూట అందుబాటులో ఉన్న జలవనరుల్లో భక్తిగా నిమజ్జనం చేస్తారు. తొలిరోజు ఎంగిలిపూల బతుకమ్మ ఆ తర్వాత వరుసగా అటుకుల బతుకమ్మ, ముద్దపప్పు, నానేబియ్యం, అట్ల, అలిగిన, వేపకాయ, వెన్నముద్దల బతుకమ్మల ఉత్సవాలు జరుగుతాయి. చివరిరోజు సద్దుల బతుకమ్మను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు.

-మిగతా 2 లో..

ఢిల్లీలో హైఅలర్ట్

నేడు జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నాకు పిలుపునిచ్చిన కాక్రోచ్ జనతా పార్టీ



నగరవ్యాప్తంగా మోహరించిన కేంద్ర బలగాలు

ఢిల్లీకి వచ్చే రైళ్లు నిలిపివేత

నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

57 మెట్రో స్టేషన్ల మూసివేత

లిక్కర్ షాప్‌ల మూసివేత, హోటల్ బుకింగ్స్‌పై ఆంక్షలు

ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని సీజేపీ పిలుపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 09 : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా మొదలైన కార్చిచ్చు మరింత రగులుతోంది. ప్రతిపక్షాలు ఎన్నికల సంఘంపై దుమ్మెత్తి పోస్తున్నాయి. ఎస్ఐఆర్‌లో విచ్చలవిడిగా అక్రమాలు జరుగుతున్నాయని, బీజేపీ వ్యతిరేకుల ఓట్లను కుట్రపూరితంగా తొలగిస్తున్నారని మండిపడుతున్నాయి. అందుకే ఈ ప్రక్రియను రద్దు చేయాలని, అక్రమాలకు బాధ్యుడైన ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పోరుబాట పట్టాయి. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద శనివారం భారీ ధర్నాకు పిలుపునిచ్చింది. అన్ని

-మిగతా 2 లో..

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ సహా సర్ ప్రక్రియను రద్దు చేయాలంటూ కాక్రోచ్ జనతా పార్టీ శనివారం ఆందోళనలకు పిలుపునివ్వడంతో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. రవాణా సదుపాయాలతో పాటు పౌరుల రాకపోకలపైనా నియంత్రణ చర్యలు చేపట్టారు. నగరంలో 45 మెట్రో స్టేషన్లు మూసివేయడంతోపాటు న్యూఢిల్లీ, నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే పలు రైళ్లనూ అధికారులు రద్దు చేశారు. వీటితోపాటు సెంట్రల్ ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు విధిస్తూ తాజాగా నిర్ణయం తీసుకున్నారు. జంతర్ మంతర్‌కు నాలుగు కిలోమీటర్ల పరిధిలో శుక్రవారం రాత్రి 10గంటల నుంచి శనివారం రాత్రి 10 వరకు ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు అమల్లో ఉండనున్నట్లు ఢిల్లీ పోలీసు వర్గాలు వెల్లడించాయి. ఇందుకు కేంద్ర హోంశాఖ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నాయి. ఈ నిర్దేశిత ప్రాంతాలు మినహా ఢిల్లీ అంతటా మొబైల్ సేవలు యథాతథంగా కొనసాగుతాయని తెలిపాయి. శనివారం ఆందోళనల నేపథ్యంలో న్యూఢిల్లీ జిల్లాను 20 జోన్లుగా విభజించి.. ఆందోళనల కట్టడి ప్రణాళికను అమలు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.





ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 09 :ఎస్ఐఆర్‌కు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పెద్ద తప్పు చేశారని ఇండియా కూటమి నేతలు ఆరోపించారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రపతితో భేటీ అనంతరం ఇండియా కూటమి నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ,

-మిగతా 2 లో..

కీటకాన్ని చంపేడానికి సుత్తి వాడేతారా?

శాంతిభద్రతల పేరుతో ప్రజా రవాణాను స్తంభింపజేయొద్దు

రైళ్లు, మెట్రో సేవలను పూర్తిగా నిలిపివేయడం తగదు

ఢిల్లీలో ఆంక్షలపై సుప్రీంకోర్టు ఆందోళన



న్యూఢిల్లీ, అక్టోబర్ 09 : కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశం కాక్రోచ్ జనతా పార్టీ భారీ ఆందోళనలకు పిలుపునివ్వడంతో కేంద్రం దిల్లీలో ప్రయాణ ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. నిరసన తెలిపే పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటంతో పాటు.. శాంతిభద్రతలను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని వ్యాఖ్యానించింది. కేంద్రం చర్యలు కీటకాన్ని చంపడానికి సుత్తిని వాడినట్లు ఉన్నాయని

-మిగతా 2 లో..

హైదరాబాద్‌లో పనులు ఏడాదిలో పూర్తవ్వాలి

అత్యుత్తమ పీఆర్‌టీఎస్‌లపై అధ్యయనం చేయండి

మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లకు అనుసంధానంగా పీఆర్‌టీఎస్

క్యూర్ పరిధిలో పనుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్‌లో ప్రారంభించిన పనులను ఏడాది లోపే పూర్తయ్యేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్లుగా క్యూర్ పరిధిలో ప్రజా రవాణా సదుపాయాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. క్యూర్ పరిధిలో ప్రజా రవాణా మెరుగుపరచడం, వివిధ రహదారుల అనుసంధానం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై సీఎం శుక్రవారం రాత్రి సమీక్ష నిర్వహించారు. రద్దీ ఉన్న ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్(పీఆర్‌టీఎస్) ఏర్పాటుకు అవసరమైన అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.



హైదరాబాద్, అక్టోబర్ 09 : "ఎక్కువ మంది ప్రజలు ప్రయాణించే ప్రదేశాలు.. వివిధ కర్మాగారాల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు రాకపోకలు సాగించే ప్రాంతాలను మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానించేలా పీఆర్‌టీఎస్ ఉండాలి. ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్‌టీఎస్‌లపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించండి. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఇందులో ముఖ్యమైన కాలనీల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు పెద్ద పీట వేయండి. క్యూర్ పరిధిలో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానం పెరిగేలా, రహదారుల్లో సజావుగా రాకపోకలు సాగించేలా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలి" అని సీఎం నిర్దేశించారు.

-మిగతా 2 లో..

జీవో 59 పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

నెల రోజుల్లోగా సుమారు 21 వేల దరఖాస్తులు పరిష్కరించాలని ప్రభుత్వ నిర్ణయం

ఉన్నతస్థాయి సమీక్షలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 09 : ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు శుక్రవారం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీవో 59కి అనుబంధంగా మెమో నంబరు 48030ను రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ జారీ చేశారు. ప్రభుత్వం వద్ద ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి నెలలోపు వాటిపై నిర్ణయం తీసుకోవడానికి

-మిగతా 2 లో..



పాలనలో పారదర్శకత పెంపే కొలమానం

ఆర్టీఐ చట్టం ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం

02

వారోత్సవాల సభలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

పర్యాటక ప్రగతిలో భాగస్వాములు అవ్వండి

ఐటీ సంస్థలకు ఉప ముఖ్యమంత్రి భట్టి పిలుపు

ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానం



హైదరాబాద్, అక్టోబర్ 09 : తెలంగాణలోని ప్రకృతి అందాలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతోపాటు పర్యావరణహిత పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఐటీ సంస్థల తోడ్పాటు తీసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో పలు ఐటీ కంపెనీల సీఈఓలు, ముఖ్య ప్రతినిధులతో శుక్రవారం రాత్రి సమావేశం నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,

-మిగతా 2 లో..

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...



నేటి నుంచి పూల పండగ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తోంది. డిసెంబరులో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమిట్ ముద్రను అందులో చేర్చనున్నారు. బతుకమ్మ నిర్వహణ కోసం ప్రభుత్వపరంగా పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సన్నాహాలు చేస్తున్నాయి. పండగ జరిగే ప్రాంతాలు, ఘాట్లు, మైదానాలకు వెళ్లే రహదారుల మరమ్మతుతోపాటు విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ ఈ ఉత్సవాల సందడి నెలకొంటుంది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలోనూ తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఆధ్వర్యంలో శనివారం బహుజన బతుకమ్మ ఉత్సవాలు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతాయి. హైదరాబాద్‌లో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి వేల సంఖ్యలో మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ పైకి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద వేడుకల్లో పాల్గొంటారు. కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై ఉన్న బతుకమ్మ ఘాట్‌తోపాటు నెక్లెస్ రోడ్డులోనూ నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని అమరవీరుల స్మారక కేంద్రం నుంచి ట్యాంక్‌బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రజలకు భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని చాటే ఆటాపాటల సాంస్కృతిక వైభవం బతుకమ్మ అని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "పువ్వులనే దేవతగా కొలుస్తూ, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల బతుకమ్మ పండగ.. దేశంలోని అన్ని సాంప్రదాయ పండుగల్లో ప్రత్యేకమైనది. తెలంగాణ జీవన విధానానికి, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సామాజిక సంస్కృతికి దర్పణంగా నిలిచే బతుకమ్మ పండగ.. తెలంగాణ ప్రజల జీవితంలో భాగమైంది. తెలంగాణ తొలి ప్రభుత్వం బతుకమ్మ పండుగకు రాష్ట్ర వేడుకగా హోదానివ్వడమే కాకుండా.. ఆడబిడ్డలకు కానుకగా బతుకమ్మ చీరలను పంపిణీ చేసే సాంప్రదాయాన్ని అమలు చేసింది" అని పేర్కొన్నారు.

జీవో 59 పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

(మొదటిపేజీ తరువాయి)

అన్ని జిల్లాల కలెక్టర్లకు అధికారాలు అప్పగించారు. భూమి రికార్డులు, లబ్ధిదారుల అర్హత, క్రమబద్ధీకరించాల్సిన విస్తీర్ణం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. దాంతో సుదీర్ఘ కాలం నుంచి స్థలాల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న జీవో 59 దరఖాస్తుదారులకు ఊరట లభించనుంది. ఇదే విషయమై వారంతా 2020 జూన్ 2వ తేదీకి ముందు నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో ఈ జీవో అమలులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు రావడంతో ప్రస్తుత ప్రభుత్వం దరఖాస్తులను పక్కన పెట్టింది. క్రమబద్ధీకరించిన కొన్ని స్థలాలనూ నిషేధిత జాబితా 22ఏలో చేర్చింది. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన వినతుల మేరకు సమస్యకు పరిష్కారం చూపేందుకు నాలుగేళ్ల క్రితం క్షేత్రస్థాయిలో సర్వే జరిగినా అమలు కాలేదు. నాడు ఒక యాప్ ఆధారంగా ఆక్రమిత స్థలాల వివరాల నమోదు చేపట్టారు. సాంకేతిక సమస్యలు తలెత్తడం, కొన్నిచోట్ల ఆక్రమిత స్థలాలపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్లు దరఖాస్తుల పరిశీలనను పక్కనపెట్టారు. తాజాగా 500 చ.గజాలలోపు ఆక్రమిత స్థలాలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నాటి ప్రభుత్వం 2014 ఫిబ్రవరిలో జీవో 59 జారీ చేసింది. దానికి కొనసాగింపుగా 2022, 2023 మార్చి, మే నెలల్లో పలు జీవోలు వచ్చాయి. ఆక్రమిత ప్రభుత్వ స్థలాలను 2014-16 మధ్య మొదటిసారి క్రమబద్ధీకరించారు. తొలుత 2014 జూన్ 2కు ముందు స్థలాలను అధీనంలో పెట్టుకున్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. 48,393 దరఖాస్తులు రాగా 17,065 ఆమోదించారు. రూ.383.11 కోట్ల రాబడి వచ్చింది. రెండోసారి 2022 ఫిబ్రవరి-మార్చిల మధ్య క్రమబద్ధీకరణ చేపట్టారు. స్థలం అధీనంలో ఉన్నట్లు చూపాల్సిన గడువును సడలించారు. 2020 జూన్ 2కు ముందు స్థలం అధీనంలో ఉన్నట్లు ఆధారాలు చూపాలని నిబంధన విధించారు. రెండోసారి దాదాపు 95 వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ క్రమంలో క్రమబద్ధీకరణ ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంది. జీవో 59 కింద రెండోసారి క్రమబద్ధీకరణకు దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాలకు దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూవర్గాలు చెబుతున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, నల్గొండ, కరీంనగర్, ఖమ్మం తదితర జిల్లాల్లో విలువైన స్థలాలను ఆక్రమించిన పలువురు దరఖాస్తులు చేసినట్లు గుర్తించారు. 22ఏలో ఉన్నప్పటికీ స్థలాలు కబ్జా కావడంపై ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే 2024లో రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల పరిశీలనను పక్కనపెట్టింది. కొన్ని కన్వీనియెన్స్ డీడ్‌లను నిలిపివేసింది. పలు దరఖాస్తులను పూర్తిగా తిరస్కరించింది. ప్రస్తుతం 20 వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొచ్చని అంచనా. గతంలో జీవో 58 ప్రకారం 125 చ.గజాలలోపు వాటిని నిరుపేదలకు ఉచితంగా క్రమబద్ధీకరించారు. ఆపై బడిన విస్తీర్ణాలను జీవో 59 పరిధిలోకి చేర్చారు. 126-250 మధ్య చ.గజాలకు రిజిస్ట్రేషన్ ధరలో 50% చెల్లించేలా, 251-500 చ.గజాల వరకు 75%, 500 చ.గజాలు మించితే 100% రిజిస్ట్రేషన్ ధర చెల్లించేలా నిబంధన విధించారు. ఇప్పుడు 500 చ.గజాలకు లోపు పరిమితం చేశారు. గతంలో నిర్ణయించినట్లుగానే రుసుం వసూలు చేస్తారా... ఏవైనా మార్పులు చేస్తారా... అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. 22ఏ నిషేధిత భూముల సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక్కొక్కటి పరిష్కరిస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం జీవో 59 అమలుపై రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... "గత నెల 16న సీఎం ఎ.రేవంత్‌రెడ్డి శాసనసభలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుతో కలిపి ఏడు ఉత్తర్వులు ఇచ్చాం. వాటిలో జీవో 118, 76ల అమలుకు ఇచ్చిన మెమోలు, స్థానిక సంస్థల నుంచి అనుమతులున్న ఆస్తుల రిజిస్ట్రేషన్లకు ఇచ్చిన ఆదేశాలు, యూఎల్‌సీ, నాలా సమస్యల పరిష్కారానికి జారీ చేసిన ఉత్తర్వులు ఉన్నాయి. జీవో నం.59 కింద 500 చ.గజాలలోపు ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు గతంలో వచ్చిన దరఖాస్తులను నెలలోపు పరిష్కరించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చాం. గతంలో జారీ చేసిన జీవోలు 14, 22, 29, 41లకు అనుగుణంగానే ఈ మెమో జారీ చేశాం. దరఖాస్తుల్లో ఏమైనా అక్రమాలు ఉన్నట్లు తేలితే ప్రస్తుత నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని అధికారులకు సూచించాం. ఇప్పటికే పరిష్కరించిన వాటికి కన్వీనియన్స్ డీడ్‌ల జారీని పరిశీలిస్తాం. గత ప్రభుత్వ హయాంలో జీవో 59 కింద క్రమబద్ధీకరణలో కొన్ని అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వ దృష్టికి రావడంతోనే మొదట్లో వాటి అమలును నిలిపివేశాం" అని వివరించారు.

ఢిల్లీలో హై అలర్ట్

(మొదటిపేజీ తరువాయి)

వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది. 'నీట్'పేపర్ లీక్ విషయంలో సీజేపీ ఆందోళన సందర్భంగా ఎదురైన అనుభవంతో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. జంతర్‌మంతర్ వద్ద శనివారం ధర్నాకు ఎలాంటి అనుమతి లేదని తేల్చిచెప్పారు. ఎవరూ రావొద్దని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నగరంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం రాజధాని మొత్తం భద్రతా బలగాల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. నగర సరిహద్దులు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్, హోటళ్లు, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఎటుచూసినా అష్టదిగ్బంధనమే కనిపిస్తోంది. అంతేకాకుండా పలు కఠిన ఆంక్షలు విధించారు. నగరంలో శాంతిభద్రతలను కాపాడటానికి విస్తృతమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఢిల్లీలో కేంద్ర పారామిలటరీ దళాలకు చెందిన 35 వేల మంది జవాన్లు మోహరించారు. నగరాన్ని తమ అదీనంలోకి తీసుకున్నారు. ప్రతి ప్రాంతాన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్ తదితర దళాలు రంగంలోకి దిగాయి. ప్రతి 50 మీటర్లకు ఒక జవాను పహారా కాస్తున్నారు. నిరసనకారులు రైళ్లలో తరలివచ్చే అవకాశం ఉండడంతో వారిని అడ్డుకోవడానికి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. దేశవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల నుంచి ఢిల్లీకి వచ్చే రైళ్లను రైల్వే శాఖ రద్దు చేసింది. నగరంలోని మొత్తం 57 మెట్రో రైలు స్టేషన్లను శుక్రవారం రాత్రి 9 గంటల నుంచి తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు మూసివేయాలని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌ను పోలీసులు కోరారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు శనివారం ఉదయం 4 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చేరుకోవాల్సిన పలు మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల నుంచి ఢిల్లీకి పలు రైళ్లు బయలుదేరాయి. నాగపూర్, భోపాల్, ఝాన్సీ, గ్వాలియర్ తదితర స్టేషన్లలో ఆగి ఉన్న రైళ్లలో ప్రయాణిస్తున్న కొందరు ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారందర్నీ సమీపంలోని పోలీసు స్టేషన్లకు తరలించినట్లు సమాచారం. ఢిల్లీలో ఎక్కడికక్కడ అదనంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. జనం కదలికలను గమనిస్తున్నారు. అలాగే 12 నిర్బంధ కేంద్రాలను సైతం సిద్ధం చేశారు. నిరసనకారులను అరెస్టు చేసి వాటిలో నిర్బంధించే అవకాశం ఉంది. శనివారం ఉదయం 6 గంటల తర్వాత ఢిల్లీలోకి ప్రవేశించే వాహనాలపై ఆంక్షలు విధించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. పోలీసులు తమను గృహ నిర్బంధంలో ఉంచారని నోయిడాలోని పలు సామాజిక సంస్థల ప్రతినిధులు, రైతు సంఘాల



సభ్యులు, రాజకీయ పార్టీల నేతలు ఆరోపించారు. మరోవైపు ఢిల్లీ సరిహద్దు రాష్ట్రాలు అప్రమత్తంగా వ్యవహరించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. జంతర్‌మంతర్ వైపు ఏ ఒక్కరూ రావొద్దంటూ ఢిల్లీ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. నగరమంతటా ఎక్కడికక్కడ బారికేడ్లను ఏర్పా టు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. యజమానుల గుర్తింపు కార్డులను పరిశీలిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని నోయిడా, గురుగ్రామ్ వంటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. నగరంలో విద్యా సంస్థలను శనివారం మూసివేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులెవరూ బయటకు రావడానికి వీల్లేదని తేల్చిచెప్పారు. దాంతో ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. శనివారం జరగాల్సిన పరీక్షలు, క్రీడా కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. ఢిల్లీలో శుక్రవారం సాయంత్రం నుంచే అన్ని మద్యం దుకాణాలను పోలీసులు మూసివేయించారు. హాస్టళ్లు, పేయింగ్ గెస్టు వసతి గృహాలను తనిఖీ చేస్తున్నారు. సెవెన్‌స్టార్ హోటళ్లు మొదలు చిన్నపాటి లాడ్జీల వరకు బుకింగ్స్‌పై ఆంక్షలు విధించారు. విదేశాల నుంచి వచ్చిన వారికి మాత్రమే హోటళ్లు, లాడ్జీల్లోకి ప్రవేశానికి అనుమతి ఇస్తున్నారు. ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో ఉన్న స్టార్ హోటళ్లు మినహా మిగతా ఇతర ప్రాంతాల్లో బుకింగ్స్‌పై ఆంక్షలు విధించడంతో సందర్శకులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వసతి దొరక్కపోవడంతో ఎక్కడ తలదాచుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీతోపాటు కొన్ని విద్యార్థి సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమానికి అనుమతి నిరాకరించినట్లు న్యూఢిల్లీ రేంజ్ జాయింట్ పోలీస్ కమిషనర్ నూపుర్ ప్రసాద్ శుక్రవారం స్పష్టంచేశారు. అనుమతి కోసం దరఖాస్తును ఆలస్యంగా సమర్పించడం, గతంలో సీజేపీ నిరసన సమయంలో నిబంధనలను ఉల్లంఘించడం వంటి కారణాలను ప్రస్తావించారు. అందుకే ఈసారి అనుమతి ఇవ్వలేదని పేర్కొన్నారు. పోలీసు రికార్డుల్లో నమోదైన నేరగాళ్లు, అనుమానాస్పద సోషల్ మీడియా ఖాతాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఈ ఏడాది జూలైలో జరిగిన నిరసనల్లో పాల్గొన్న వారిలో 2,873 మందికి నేర చరిత్ర ఉన్నట్లు గుర్తించి, వారి కదలికలపై దృష్టి పెట్టారు. ఉత్తరప్రదేశ్, హరియాణా, రాజస్తాన్ వైపు నుంచి ఢిల్లీకి వచ్చే మార్గాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. నోయిడాను ఢిల్లీతో కలిపే సరిహద్దుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. నిరసనకు సంబంధించి సోషల్ మీడియాలో సాగుతున్న ప్రచారంపైనా పోలీసులు నిఘా పెంచారు. నిరసనకు ప్రజలను సమీకరించే ప్రయత్నాలు, వాట్సాప్, టెలిగ్రామ్ తదితర వేదికల్లో జరుగుతున్న ప్రచారాన్ని పరిశీలిస్తున్నారు. 200 సోషల్ మీడియా చానళ్లను పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జంతర్‌మంతర్‌కు 4 కిలోమీటర్ల పరిధిలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు ఢిల్లీ పోలీసు వర్గాలు తెలిపాయి. శనివారం రాత్రి 10 గంటల నుంచి ఆదివారం 10వ తేదీ రాత్రి 10 గంటల వరకు సేవలు నిలిచిపోనున్నట్లు వెల్లడించాయి. ఈ నిర్ణయానికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని అధికారులు చెప్పారు. ఈ నిలిపివేత అన్ని మొబైల్ ఇంటర్నెట్ సేవలకు వర్తిస్తుంది. ఢిల్లీలోని మిగిలిన ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం ఉండదని తెలిపారు. సెంట్రల్ ఢిల్లీలో పలు ప్రాంతాల్లో జామర్లు ఏర్పాటు చేయడంతో ఫోన్ సిగ్నల్స్ అందడం లేదు. శాంతిభద్రతలను కాపాడేందుకు న్యూఢిల్లీ జిల్లాను 20 జోన్లుగా విభజించినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. భద్రతా ఏర్పాట్లపై పర్యవేక్షణ కోసం ఈ 20 జోన్లలో ప్రతి జోన్‌ను ఒక జాయింట్ కమిషనర్, ఒక డిప్యూటీ కమిషనర్, ఒక అదనపు డిప్యూటీ కమిషనర్‌ను నియమించినట్లు చెప్పారు. భద్రతా చర్యల్లో భాగంగా న్యూఢిల్లీ, సెంట్రల్ ఢిల్లీ, నార్త్ ఢిల్లీ జిల్లాల్లోని కీలక ప్రదేశాల్లో అదనపు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఢిల్లీలో నిరసన ప్రదర్శనకు కాక్రోచ్ జనతా పార్టీ మద్దతుదారులు ఎవరూ వెళ్లకుండా నిరోధించాలని, ఈ విషయంలో ఢిల్లీ పోలీసులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశిస్తూ కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల డీజీపీలకు లేఖ రాశారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలని కోరుతూ ఢిల్లీ పోలీసు లు 'ఎక్స్'లో పోస్టుచేశారు. "యూనిఫాం వెను క కూడా ఒక మనిషి ఉంటారు"అని వివరించారు. ధర్నాల్లో పిల్లలు పాల్గొనకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు.

హైదరాబాద్‌లో పనులు ఏడాదిలో పూర్తవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

కేబీఆర్ పార్కు చుట్టూ వన్ వేతో రాకపోకలు మరింత సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. యుటిలిటీస్ తరలింపును వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. "నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్ పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయండి. ముంబయి వంటి నగరాల్లో పైవంతెన పనులు ఏడాదిలో పూర్తవుతున్నాయి. అక్కడ వినియోగిస్తున్న సాంకేతికత, పనుల తీరుపై అధ్యయనం చేయండి" అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. హైదరాబాద్-ముంబయి బుల్లెట్ ట్రైన్ మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మాణంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. శంకర్‌పల్లి-చేవెళ్ల మధ్య ఇప్పుడు ఉన్న రహదారుల విస్తరణతో పాటు నూతన రోడ్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. శుద్ధి చేసిన నీటి వినియోగానికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. 500 ఎంఎల్‌డీ రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వెల్లి, ఆలూరులలోని డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలు శుద్ధి చేసిన నీటిని వినియోగించుకునేందుకు వీలుగా పనులు చేపట్టాలి. హైరైజ్ బిల్డింగుల నిర్మాణం, ల్యాండ్ స్కేప్స్, పార్కుల్లో వాడేలా చర్యలు తీసుకోవాలి' అని ఆదేశించారు. క్యూర్ చట్టం అమలుకు సంబంధించి హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లు, హైడ్రా, వాటర్ బోర్డు, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం ఆదేశించారు. సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కార్యాలయాల పనులు వేగవంతం చేయాలని సూచించారు. సమీక్షలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, ప్రభుత్వ సలహాదారు(పట్టణ రవాణా, మెట్రో) ఎన్‌వీఎస్ రెడ్డి, హైదరాబాద్ మెట్రోరైలు అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి, వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కీటకాన్ని చంపడానికి సుత్తి వాడతారా?

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొంది. వివిధ పనుల నిమిత్తం నగరంలోని ప్రజలు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణిస్తుంటారని.. కాబట్టి అన్నింటినీ మూసివేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. మూసివేసి ఉన్న మెట్రో స్టేషన్ల సంఖ్య తగ్గించాలని కేంద్రానికి సూచించింది. దిల్లీలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుకు వ్యతిరేకంగా సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణలో భాగంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'మా ఆందోళన ఏ ఒక్క నిరసనకారుడి గురించో లేదా వ్యక్తి గురించో కాదు. మెట్రో, రైల్వే స్టేషన్ల ప్రవేశ ద్వారాలను పూర్తిగా మూసివేయడం గురించే మా ప్రధాన ఆందోళన. జీవనోపాధి కోసం గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా, తూర్పు, దక్షిణ దిల్లీల నుంచి దేశ రాజధానికి నిత్యం వేల మంది ప్రయాణిస్తుంటారు. వారందరికీ సొంత వాహనాలు ఉండవు. ప్రజారవాణాపైనే ఆధారపడతారు. ఇలా అన్నింటినీ పూర్తిగా మూసేస్తే వారి పరిస్థితి ఏమవుతుంది? అనియంత్రిత కదలికలను అరికట్టడానికి, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకునే అధికారం మీకు ఉంటుంది. కానీ, నిరసనలు ఆపడానికి ప్రజా జీవితాన్ని స్తంభింపచేయడం సరైంది కాదు. ఏ ప్రాంతంలో ఆంక్షలు అవసరం? ఎక్కడ అవసరం లేదనే విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి' అని సుప్రీం కోర్టు పేర్కొంది. న్యాయస్థానం వ్యాఖ్యలపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. ఆంక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి, తగిన చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం సీజేపీ నిరసనల నేపథ్యంలో దిల్లీలోని 57 మెట్రో స్టేషన్ల మూసివేత ప్రకటనపై ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే (ూఎప్థఱయవవ్ ణఱజూెవ) విమర్శలు గుప్పించారు. జంతర్‌మంతర్ అనేది నిర్దేశిత ప్రదేశమని..అక్కడ నిరసన తెలిపేందుకు ప్రభుత్వ మద్దతు అవసరం లేదని పేర్కొన్నారు. యువతకు భయపడితే మొత్తం దేశాన్నే మూసివేయాలన్నారు.

పర్యాటక ప్రగతిలో భాగస్వాములు అవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజుతోపాటు అటవీ, పర్యాటకశాఖల ఉన్నధికారులు హాజరయ్యారు. వివిధ ఐటీ సంస్థల సీఈవోలు, ప్రముఖులు... రాజన్న(టీసీఎస్), కిరణ్ చెరుకూరి (హెచ్‌సీఎల్), చింతలపాటి శ్రీనిరాజు(ఐ ల్యాబ్స్), మమత మద్దిరెడ్డి(హెచ్‌ఎస్‌బీసీ), వినయ్ అగర్వాల్(టెక్ మహీంద్ర), రామ్‌కుమార్(జెన్‌ప్యాక్), చంద్రశేఖర్‌శర్మ(సీటీఆర్‌ఎల్‌ఎస్) తదితరులు పాల్గొన్నట్లు అటవీ శాఖ వెల్లడించింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ... "తెలంగాణలో ఎకో, ఫారెస్ట్, టెంపుల్ టూరిజం అభివృద్ధిలో ఐటీ సంస్థలు భాగస్వాములు కావాలి. ఐటీ ఉద్యోగులు వారాంతాల్లో కుటుంబాలతో కలిసి పర్యాటక ప్రాంతాల్ని సందర్శించేలా ప్రోత్సహించాలి. ప్రాణహిత-చేవెళ్ల, కాళేశ్వరం ప్రాజెక్టులకు, కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులకు ప్రాచుర్యం కల్పించాలి. ఫ్యూచర్‌సిటీలో ఐటీ సంస్థలు, పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టాలి. డిసెంబరులో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సులో భాగంగా దేశంలోని ప్రధాన నగరాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తాం" అని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో పర్యాటక సౌకర్యాల మెరుగుదల, ఇంటర్నెట్ కనెక్టివిటీ, డిజిటల్ వేదికల ద్వారా ప్రచారం చేయడం వంటి అంశాలపై ఐటీ సంస్థల ప్రతినిధులతో ప్రభుత్వం చర్చించింది. తెలంగాణలోని ఎకో టూరిజం ప్రాజెక్టులు, ప్రకృతి అందాలు, పర్యాటక ఆకర్షణలు, సందర్శకులకు అందుబాటులో ఉన్న అవకాశాలను పవర్-పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఐటీ కంపెనీల ప్రతినిధులకు అటవీశాఖ వివరించింది. ఈ సమావేశంలో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్, హెచ్.ఓ.ఎఫ్‌ఎఫ్) వినయ్ కుమార్, సీసీఎఫ్‌లు శరవణన్, ప్రియాంక వర్గీస్, క్షితిజ, పర్యాటకశాఖ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)


మమతా బెనర్జీ, ప్రియాంకా గాంధీ తదితరులు మీడియాతో మాట్లాడారు. "ఓటు చోరీకి సంబంధించి రాష్ట్రపతికి వివరించాం. ఓట్ల చోరీ ఎక్కడెక్కడ జరిగిందో ఆధారాలు అడిగారు. బ్యాలెట్ పత్రాల ద్వారానే ఎన్నికలు జరపాలని కోరాం. ఓట్ల చోరీ జరుగుతోందని దేశం మొత్తానికి తెలుసు. సీఈసీ కార్యాలయం నుంచే అన్ని చోరీలు జరుగుతున్నాయి. ఓట్ల చోరీలో మోదీ ఆర్కిటెక్.. అమిత్ షా, జ్ఞానేశ్ అమలు చేస్తున్నారు. ఓట్ల చోరీపై ఆలోచించి చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి చెప్పారు" అని రాహుల్ గాంధీ అన్నారు. రాష్ట్రపతి ముర్ముకు మెమోరాండం ఇచ్చామని, ఓటు చోరీకి సంబంధించి వివరించామని ఖర్గే మీడియాకు తెలిపారు. దీనిపై సంబంధిత వర్గాలతో మాట్లాడతానని రాష్ట్రపతి చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. "హరియాణా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, దిల్లీ, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి. ఈవీఎంలు, ఓటర్ల జాబితాలను భాజపా తారుమారు చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి. సీఈసీ, ఎన్నికల కమిషనర్లకు జీవితకాల రక్షణ కల్పించే 2023 చట్టాన్ని రద్దు చేయాలి. సర్ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 13.30 కోట్ల మంది పేర్లను వెంటనే తిరిగి చేర్చాలి. ఓట్ల చోరీకి సంబంధించి ఆధారాలు సమర్పించిన గత రెండేళ్ల అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయాలి. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణమే జోక్యం చేసుకోవాలి" అని కూటమి నేతలు రాష్ట్రపతికి విజ్ఞప్తి చేశారు.

పాలనలో పారదర్శకత పెంపే కొలమానం

ఆర్టీఐ చట్టం ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం

వారోత్సవాల సభలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

హైదరాబాద్ : దరఖాస్తులు, అప్పీళ్ల పరిష్కారం సంఖ్యతో మాత్రమే సమాచార హక్కు చట్టం విజయాన్ని అంచనా వేయలేమని.. పాలనలో పారదర్శకతను ఎంత పెంపొందించగలిగామన్నదే ఈ వ్యవస్థ విజయానికి నిజమైన కొలమానమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ సమాచార కమిషన్ నిర్వహిస్తున్న సమాచార హక్కు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్‌తోపాటు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి, డీజీపీ సీవీ ఆనంద్, పీసీసీఎఫ్ వినయ్‌కుమార్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మహేశ్ దత్ ఎక్కా, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఆర్టీఐ చీఫ్ కమిషనర్ జి.చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు పి.వి.శ్రీనివాసరావు, మొహిసినా పర్వీన్, దేశాల భూపాల్, వైష్ణవి మెర్ల సహా పలువురు పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన



సంస్థలు, అధికారులకు గవర్నర్ అవార్డులు అందజేశారు.

రైతుల ప్రయోజనానికే భూముల రీసర్వే

కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడి

ఫతేపూర్ లో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియ పరిశీలన

పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం

రైతుల సమక్షంలో సర్వే నిర్వహించాలని మార్గనిర్దేశం

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 09 :



రైతులు, భూ యజమానుల ప్రయోజనాలను కాపాడుతూ, భవిష్యత్తులో వారికి ఎలాంటి భూ సమస్యలు తలెత్తకూడదు అనే సదుద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే జరిపిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. ఈ ప్రక్రియకు రైతులు పూర్తి స్థాయిలో సహకరించాలని సూచించారు. సాలూర మండలం ఫతేపూర్ లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, తద్వారా ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కావని అధికారులకు సూచించారు. రైతులు, పట్టాదార్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వేను నిర్వహిస్తూ, వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే, తమ దృష్టికి తేవాలన్నారు. సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి, వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కాగా, సాలూర మండలంలో తొలి విడతలో మూడు గ్రామాలలో భూముల రీసర్వే జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటికే బోధన్ రెవెన్యూ డివిజన్ లోని పోతంగల్, రెంజల్ తదితర మండలాల్లో 3వేల ఎకరాల వరకు విస్తీర్ణంలో సర్వే ప్రక్రియ పూర్తయ్యిందని తెలిపారు. రీసర్వే వల్ల భవిష్యత్తులో సరిహద్దు సమస్యలు ఉత్పన్నం కావని, తద్వారా భూ వివాదాలకు ఆస్కారం ఉండదని,
భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే విషయంలో రైతులకు, భూ యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే గ్రామ పంచాయతీ అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయకుమారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు శ్రీనివాస్ రావు, స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్ రాజాగౌడ్

వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, అక్టోబర్ 09 :



నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా (రెవెన్యూ) రాజాగౌడ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన చాంబర్ కు చేరుకుని బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆయన మర్యాదపూర్వకంగా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ కు స్వాగతం పలికి, పరిచయం చేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ గా కొనసాగిన ఎస్.కిరణ్ కుమార్ పదవీ విరమణ చేయగా, ఆయన స్థానంలో జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా కొనసాగుతున్న రాజాగౌడ్ ను నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ప్రభుత్వం ఇటీవలే పోస్టింగ్ కల్పించింది. ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడికి చేరుకుని బాధ్యతలు స్వీకరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్ఓ గీత, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు, కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు అదనపు కలెక్టర్ ను బాధ్యతలు చేపట్టిన సందర్భంగా కలిసి స్వాగతం పలికారు. కాగా, అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఇదివరకు నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని బాన్సువాడ, బోధన్, ఆర్మూర్ లలో రెవెన్యూ డివిజనల్ అధికారిగా (ఆర్.డీ.ఓ)గా విధులు నిర్వర్తించారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తాం!

డిప్యూటీ డైరెక్టర్ కే. దశరథ్ హామీ.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్



: పెన్షనర్ల సమస్యలను పరిష్కరిస్తాం అని డిప్యూటీ డైరెక్టర్ కే. దశరథ్ హామీ ఇచ్చారు. నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ అమలుకు సంబంధించి నిజామాబాద్ జిల్లాలో 6716 మంది సర్వీస్ పెన్షనర్లు,5556 మంది ఫ్యామిలీ పెన్షనర్లు ఉండగా అందులో ఇప్పటికీ వరకు కేవలం 4,789మంది మాత్రమే నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ కు సంబంధించి తమ వివరాలను ఆన్లైన్లో ప్రభుత్వానికి సమర్పించారని , ఇంకా సగానికి పైగా పెన్షనర్లు హెల్త్ కార్డులు పొందలేదని, పాత హెల్త్ కార్డులు ఎప్పటి వరకు వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతిస్తుందో చెప్పలేమని తక్షణమే ప్రతి పెన్షనరు తన వివరాలను ఆన్లైన్లో పొందు పరచాలని డిప్యూటీ డైరెక్టర్ జిల్లా కోశాధికారి కే. దశరథ్ అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం నాడు పెన్షనర్స్ భవనంలో పెన్షనర్స్ గ్రీవెన్స్ డే ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డి టి ఓ దశరథ్ మాట్లాడుతూ, ప్రతినెల పెన్షనర్ల కోసం వారి వద్దకే సిబ్బందితో సహా వచ్చి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా అనేకమంది పెన్షనర్లు తమ సమస్యలను ముఖాముఖి డి టి ఓ మరియు ట్రెజరీ సిబ్బంది దృష్టికి తీసుకొని వచ్చారు. కొన్ని సమస్యలు అప్పటికప్పుడు పరిష్కరించారు. హెల్త్ కార్డులు పొందటంలో ఉన్న సమస్యలను ఆయన పరిష్కరించారు. జిల్లా అధ్యక్షులు సిర్ప హనుమాన్లు అధ్యక్షత జరిగిన ఈ సభలో ప్రత్యేక అతిథిగా హాజరైన రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ కే రామ్మోహన్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పి ఆర్ సి ని వెంటనే బహిరంగ పరచాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రధాన కార్యదర్శి ఈవీఎల్ నారాయణ మాట్లాడుతూ,

నగదు రహిత వైద్యాన్ని కార్పొరేటు, ప్రైవేటు ఆసుపత్రులలో ఎలాంటి మినహాయింపులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి ఆఫీసు మొత్తం పెన్షనర్స్ భవనానికి తరలి వచ్చారు.ఈ సభలో ఇంకా జిల్లా నాయకులు ప్రసాదరావు, రాధా కిషన్, మదన్ మోహన్, నరేందర్, కృష్ణారావు, సాంబశివరావు, రాజేశ్వర్, జగన్మోహన్ ఫయాజుద్దీన్, దీన సుజనా ఎస్ టి ఓ సాయి కుమార్, ట్రెజరరీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో...



వేగుచుక్క న్యూస్, కామారెడ్డి:



ఎల్లారెడ్డి నియోజకవర్గం లోని తాడ్వాయి మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. వివిధ రకాల పువ్వులతో విద్యార్థినిలు బతుకమ్మలను పేర్చి సంబరాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస రావు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి బతుకమ్మ సంబరాలకు శ్రీకారం చుట్టారు.అంతకు ముందు ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది విద్యార్థులతో కలిసి సహ పంక్తి భోజనం చేశారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో బతుకమ్మ పాటలు పెట్టి ఆటపాట ఆడారు. ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపకులు కూడా విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆట ఆడి పండుగ ప్రత్యేకత చాటారు. సాయంత్రం బతుకమ్మ లను దగ్గర లో గల చెరువులో నిమజ్జనం చేశారు.

అమ్మవారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాం..

ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టు చీరల పంపిణీ...



వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

దుర్గామాతకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని ధన్ పాల్ లక్ష్మీ బాయి విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్లు ఉదయ్ కుమార్, ప్రణయ్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్ లు పేర్కొన్నారు. నగరంలోని మిర్చి కంపౌండ్ లో గల డీఎస్ఎన్ కార్యాలయంలో అమ్మవారి మండప నిర్వాహకులకు ట్రస్టు ఆధ్వర్యంలో పట్టు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రస్టు ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా గత పది సంవత్సరాలుగా అమ్మవారి మండపాలకు పట్టుచీరలను పంపిణీ చేస్తున్నామన్నారు. నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో నియమ నిబంధనలతో నవరాత్రులను జరుపుకోవాలన్నారు. ఇందూరు నియోజకవర్గంలోని ప్రతి మండపానికి తమ వంతు సహకారంగా చీరలను అందజేస్తున్నామన్నారు. హిందూ పండుగల్లో అమ్మవారి నవరాత్రులకు ఎంతో ప్రత్యేకత ఉంటుందన్నారు. ప్రతి సంవత్సరం ఇందూరులో మండపాలు పెరుగుతున్నాయని, యువత భక్తి మార్గంలో పయనిస్తున్నారన్నారు. లోకమాత దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ,

కార్పొరేటర్లు మఠం పవన్, బంటు రాము, మల్కాయి మహేందర్, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, ధాత్రిక పరమేశ్వర్, నాయకులు పవన్ ముందడ, మారావార్ కృష్ణ, శ్రీనివాస్, బాబీ సింగ్, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



నాగన్న గారి బావి పరిసరాలు శుభ్రంగా ఉండాలి.

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.

వేగుచుక్క న్యూస్,కామారెడ్డి జిల్లా:



లింగంపేట మండలంలోని నాగన్న గారి బావిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం సందర్శించి, అక్కడి పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. బావి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, నాగన్న గారి బావి పరిసరాల్లో ఎలాంటి అపరిశుభ్రతకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బావి పరిసరాల్లో ఆహార పదార్థాలను వినియోగించకుండా తగిన చర్యలు చేపట్టాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాలని ఆదేశించారు. పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, తహసిల్దార్ సురేష్, ఎంపీడీవో ప్రవీణ్, మండల స్పెషల్ ఆఫీసర్ సురేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు



నలంద హైస్కూల్‌లో.. ఘనంగా "బతుకమ్మ వేడుకలు"



- ఆటపాటలతో అలరించిన మహిళ ఉపాధ్యాయులు, విద్యార్థినులు.
- పాల్గొన్న పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్.

వేగుచుక్క న్యూస్,ఆర్మూర్:

పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్‌లో బతుకమ్మ పండుగ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన కోలాటాలు, నృత్య ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. దీనితో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది.
పాఠశాల యాజమాన్యం ప్రసాద్, సాగర్ మాట్లాడుతూ,
విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, వారి కుటుంబ సభ్యులకు బతుకమ్మ మరియు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గౌరీదేవి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.
అలాగే బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో ఈ పండుగకు ఉన్న ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. ప్రకృతిని, పూలను ఆరాధిస్తూ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ బతుకమ్మ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.















కాకతీయ (కె.ఓ.ఎస్)లో.. ఘనంగా "బతుకమ్మ" సంబరాలు.



- ఆటపాటలతో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు.
- విద్యార్థులు ఎల్లప్పుడూ మంచి మార్గంలో నడవాలి.
- కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ సిహెచ్. విజయలక్ష్మి, డైరెక్టర్ రజనీకాంత్ పిలుపు.
- పాల్గొన్న విద్యాసంస్థల డైరెక్టర్లు రాజా, తేజస్విని, రామోజీరావు.

"జిల్లా కేంద్రంలోని కాకతీయ విద్యాసంస్థ (కె.ఓ.ఎస్)లో శుక్రవారం దసరా మరియు బతుకమ్మ పండుగ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ విభాగం అధ్యాపకులు మరియు విద్యార్థినీ, విద్యార్థులు సంయుక్తంగా శ్రమించి వినూత్న దుర్గాదేవి విగ్రహాలను రూపొందించి అందరి ప్రశంసలు అందుకున్నారు."



వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:

కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సి. హెచ్. విజయలక్ష్మి మాట్లాడుతూ, ఎంతో ఘనంగా జరిగిన ఈ వేడుక సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ సి. హెచ్. విజయలక్ష్మి జిల్లా విద్యార్థినీ, విద్యార్థులకు, జిల్లా అధ్యాపకులకు, జిల్లా తల్లిదండ్రులకు, జిల్లా ప్రజలందరికీ మంచి జరగాలని, అన్నీ విజయాలు దక్కాలని ఆశిస్తూ ముందస్తు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ..., "చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ప్రతీ సంవత్సరం ఈ వేడుకలు జరుపుకుంటాము. విద్యార్థులు ఎల్లప్పుడూ మంచి మార్గంలో నడవాలి. అధ్యాపకులు వారికి సరైన దిశానిర్దేశం చేస్తూ, తద్వారా భావి భారత పౌరులై దేశానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని" విద్యార్థులకు తెలియజేశారు. అలాగే విద్యార్థుల్లో విద్యాబుద్ధులతో పాటు దేశభక్తి, రాష్ట్రాభిమానం మరియు సంస్కృతీ సాంప్రదాయాలపై అవగాహన పెంచేందుకే ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్లు రాజా, తేజస్విని, రామోజీరావు, కాకతీయ విద్యాసంస్థల విద్యార్థినీ, విద్యార్థులకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు ముందస్తుగా దసరా-బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



7 ఫీట్ల దుర్గాదేవి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణ:

ఈ వేడుకల్లో ప్రధానంగా 7 ఫీట్ల ఎత్తు కలిగి, తెలంగాణ సంస్కృతి, దేశభక్తి ప్రతిబింబించే దుర్గాదేవి ప్రతిమ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనిని ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు రూపొందించారు.

నవదుర్గమాత విశిష్టత:

ఈ వేడుకల్లో నవదుర్గమాతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దుర్గాదేవి పరాశక్తి స్వరూపం. ముఖ్యంగా స్త్రీ శక్తికి చిహ్నంగా నిలుస్తూ, భక్తులలో ఆత్మవిశ్వాసం, ధృడ సంకల్పాన్ని పెంపొందిస్తుంది. నవరాత్రులలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరి, గాయత్రి, అన్నపూర్ణ, లలితా త్రిపుర సుందరి, సరస్వతి, లక్ష్మి, మహిషాసుర మర్దిని వంటి వివిధ రూపాలలో ఆరాధిస్తారు. ఈ విధంగా తొమ్మిది రోజుల్లో తొమ్మిది అవతారాలలో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించడం జరుగుతుంది.

ఆకట్టుకున్న రోబోటిక్ దుర్గామాత:

వేడుకల్లో ఐ 20 అధ్యాపకులు మరియు విద్యార్థులు తయారు చేసిన రోబోటిక్ దుర్గమాత ఎంతో ఆకట్టుకుంది. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ని ప్రతిబింబించేలా రూపొందించిన ఈ ప్రతిమ విద్యార్థుల భక్తికి, తెలివికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన బతుకమ్మ సంబరాలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రిన్సిపాళ్లు రణదీశ్, సందీప్, గిరిధర్, చంద్రశేఖర్, భావన, ఫణీందర్, రాజ్ కిరణ్, విపిన్, నటరాజ్, సంతోష్, సుచరిత, రాఘవేంద్ర ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.







